AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

యథేచ్ఛగా మొరం తవ్వకాలు

2

2

బంద్‌కు సంపూర్ణ మద్దతు

కొనుగోలు కేంద్రాల పరిశీలన

అక్షరటుడే, బోధన్: మండలంలోని సంగెం, భవానీపేట్ కొనుగోలు కేంద్రాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీరియల్ నెంబర్‌ల వారీగా రైతుల ధాన్యాన్ని నమోదు చేసుకోవాలని.. అదేవిధంగా రైతులకు తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా వడ్లు కొనుగోలు చేసేటప్పుడు తేమ శాతాన్ని సరిగ్గా చెక్ చేయాలని ఆదేశించారు.

17-10-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

జోరుగా వరి కోతలు..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వరి కోతలు ఊపందుకున్నాయి. ఆరుగాలం శ్రమించిన పంట చేతికి రావడంతో అన్నదాతలు కోతల్లో బిజీబిజీగా మారారు. పంట కోసిన అనంతరం ఖాళీ స్థలాల్లో ధాన్యాన్ని నేర్పుతూ ఆరబెడుతున్నారు. తేమ శాతం తగ్గిన అనంతరం వడ్లను సంచుల్లో నింపి.. కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. మోపాల్ మండలంలో వరి కోతలు కొనసాగుతుండగా తీసిన చిత్రాలివి..

– అక్షరటుడే, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఐరాడ్, ఈడార్‌లను విజయవంతంగా నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు. నిజామాబాద్‌ను మోడల్ జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐరాడ్, ఈడార్ ప్రాజెక్టును నిజామాబాద్ జిల్లాలో జూలై 2021 నుంచి రోడ్డు ప్రమాదాల నివారణకు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహన, శిక్షణ, సామూహిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టులో పోలీస్ శాఖ, రవాణా శాఖ, ఆరోగ్య శాఖ, రహదారుల శాఖల సమస్వయంతో పనిచేస్తాయని వివరించారు. ప్రమాదాల నివారణకు వినూత్న రీతుల్లో ఆర్మూర్ జక్రాన్‌పల్లి, ఎడపల్లి, నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలలో డమ్మీ రోడ్డు ప్రమాద ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాజెక్టులో ఇందూరు జిల్లా ప్రగతిపథంలో దూసుకెళ్తోందని సీపీ వివరించారు. నిజామాబాద్ జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖలను ఈ ప్రాజెక్టుకు అనుసంధానం చేశామన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా.. దాదాపు 200 కన్నా ఎక్కువ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని సీపీ తెలిపారు. వివిధ శాఖల సమన్వయంతో 2021 నుండి ఇప్పటివరకు ఆయా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు.

వినూత్నం.. ఈ పాఠశాల ప్రయత్నం..

దీపావళి పండుగను పురస్కరించుకుని బాన్సువాడలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంలో చిన్నపిల్లల ఆరోగ్యానికి ముప్పుగా మారిన జంక్ ఫుడ్‌ను ఆధునిక నరకాసురుడిగా ప్రతీకాత్మకంగా చూపించారు. జంక్ ఫుడ్ నరకాసురుడి బొమ్మను విద్యార్థుల ఆధ్వర్యంలో దహనం చేశారు. జంక్ ఫుడ్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై పిల్లల్లో అవగాహన పెంపొందించ డానికి ఈ ప్రయత్నం చేశామని ప్రిన్సిపాల్ లావణ్య నరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌభాగ్య, వీణ, సునీత, సుష్మా, రేఖ, మౌనిక, గౌతమి, సవిత తదితరులు పాల్గొన్నారు.

- అక్షరటుడే, బాన్సువాడ

స్టేడియం ఏర్పాటు కలేనా?

నిజామాబాద్ నగరంలో మినీ స్టేడియం ఏర్పాటు కలగానే మారింది. కలెక్టర్ గ్రౌండ్‌లో నిర్మాణం చేపడతామని ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు. దీంతో క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సరైన వసతులు లేకున్నా నగరానికి చెందిన ఎంతో మంది అంతర్జాతీయ, జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటుతున్నారు. కాగా.. స్టేడియం అందుబాటులోకి వస్తే వారికి ప్రాక్టీస్‌కు అవకాశం ఉంటుంది. దీంతో మరింత మంది క్రీడాకారులు రాణించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

- అక్షరటుడే, ఇందూరు

■ నగరంలో నిర్మిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ■ ఇప్పటికీ ముందుకు పడని అడుగులు ■ ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌ను కూల్చివేసిన అనంతరం ఆ స్థలంలో పలు కట్టడాలు నిర్మిస్తారంటూ ఊహాగానాలు వచ్చాయి. దీంతో మైదానాన్ని కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని భావించిన క్రీడా సంఘాలు, క్రీడాకారులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. స్టేడియం నిర్మించాలంటూ పలుమార్లు వినతులు అందించారు. దీంతో నూతన స్టేడియాన్ని నిర్మిస్తామంటూ స్వయంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. పూర్తి హంగులతో మినీ స్టేడియం నిర్మాణ పనులు చేపడతామంటూ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలు తెలిపారు. దీంతో క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేశారు.

పురోగతి లేదు..

పాత కలెక్టరేట్ మైదానం 2 ఎకరాలకు పైగా ఉంటుంది. ఇందులో సింథటిక్ ట్రాక్‌తో కూడిన మినీ స్టేడియం నిర్మిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది హైదరాబాద్ నుంచి అధికారులు వచ్చి కొలతలు కూడా తీసుకున్నారు. దీంతో త్వరలోనే స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని క్రీడాకారులు సంతోషించారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి పురోగతి కనిపించలేదు. కనీసం స్థలాన్ని కూడా క్రీడా ప్రాధికార సంస్థకు అప్పగించలేదు.

అసౌకర్యాల మధ్యే పోటీలు

ప్రతి సంవత్సరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌తో పాటు ఆయా క్రీడా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నగరంలో నిర్వహిస్తారు. అయితే పోటీలకు సౌకర్యంగా ఉండే ఒక్క స్టేడియం జిల్లాలో లేకపోవడం గమనార్హం. జిల్లా కేంద్రంలో ఉన్న పాత కలెక్టరేట్ మైదానం, నాగారం స్టేడియంలోనే పోటీలు నిర్వహిస్తున్నారు. వీటిలోనూ సరైన సౌకర్యాలు లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మినీ స్టేడియం నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు.

ఎలాంటి సమాచారం లేదు

స్టేడియానికి సంబంధించి ఇప్పటివరకు మాకు ఎటువంటి సమాచారం అందలేదు. గతంలో డీఎస్ఏ మైదానాన్ని (పాత కలెక్టరేట్ మైదానం) కొలతలు తీసుకొని వెళ్లారు. కానీ నిర్మాణానికి సంబంధించి ఎటువంటి ఆదేశాలు రాలేదు.

– పవన్ కుమార్, జిల్లా యువజన క్రీడల అధికారి

వ్యవసాయ కళాశాల మంజూరుపై మానాల హర్షం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లాకు అగ్రికల్చర్ కళాశాల మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. అగ్రికల్చరల్ కాలేజ్ మంజూరుకు కృషి చేసిన మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి సైతం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేయడంతో.. వ్యవసాయంపై ఆసక్తి ఉన్న ఎందరో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన గడుగు గంగాధర్..

అక్షరటుడే, ఇందూరు: జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన వ్యవసాయ కళాశాలను మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నో ఏళ్లుగా జిల్లా ప్రజలు, జిల్లా రైతాంగం వ్యవసాయ కళాశాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రైతుల పక్షపాతి అయిన సీఎం జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. తాను సైతం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకు పలుమార్లు వ్యవసాయ కళాశాల గురించి విజ్ఞప్తి చేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.

ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరగాలి : కలెక్టర్

అక్షరటుడే, బాన్సువాడ: జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా చేపట్టాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మోస్రా, చందూర్, వర్ని మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలను రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. రైతులకు రసీదులు ఇవ్వాలని, ట్రక్ షీట్లు వచ్చిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలు చేయడం ద్వారా బిల్లులు సకాలంలో చెల్లించగలుగుతామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, మాయిశ్చర్ మీటర్లు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని, హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లారీల కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఖరీఫ్‌లో జిల్లాలో మొత్తం 670 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 300 వరకు కేంద్రాలు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ధాన్యం కోతలు పూర్తవుతున్న ప్రాంతాల్లో తక్షణమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. మొక్కజొన్న పంట సాగు చేసిన ప్రాంతాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సివిల్ సప్లయ్స్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, సహకార శాఖ అధికారి అంబర్ సింగ్, వర్ని మార్కెట్ చైర్మన్ కులకర్ణి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే

అక్షరటుడే, ఇందల్వాయి: మండలకేంద్రంలోని రైల్వేగేట్ సమీపంలో స్పందన అనే ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు రూరల్ ఎమ్మెల్యే డా ఆర్ భూపతిరెడ్డి హాజరై ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు రిజ్వాన్ హర్షద్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ గౌడ్, చింతల కిషన్, రాజు నాయక్, డాక్టర్ స్పందన, డాక్టర్ రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

15 రోజుల్లో 164 సెల్‌ఫోన్ల రికవరీ: ఎస్పీ

అక్షరటుడే, కామారెడ్డి: జిల్లాలో ప్రతినెలా 150కి పైగా పోగొట్టుకున్న మొబైళ్లను రికవరీ చేస్తున్నట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. గత 15 రోజుల్లో 164 మొబైళ్లను రికవరీ చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ నిత్యావసరంగా మారిందన్నారు. అందులో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డులు, సోషల్ మీడియా అకౌంట్లు, వ్యక్తిగత ఫొటోలు వంటి కీలకమైన డేటా ఉంటుందని తెలిపారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్‌లో ద్వారా ఫోన్‌ను సులభంగా గుర్తించి తిరిగి పొందే అవకాశం ఉందని వివరించారు. గత 15 రోజుల్లో 164 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని ఎస్పీ వివరించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మొత్తం 2.53 కోట్ల విలువ చేసే 1,579 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. పోర్టల్ ప్రారంభం నుండి ఇప్పటివరకు జిల్లాలో మొత్తం రూ. 6.45 కోట్ల విలువ చేసే 4,026 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు.

ముప్కాల్ ఎంపీడీవోగా రమేశ్ బాధ్యతల స్వీకరణ

అక్షరటుడే, ముప్కాల్: ముప్కాల్ మండల నూతన ఎంపీడీవోగా బి.రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన బాలగంగాధర్ రుద్రూర్‌కు బదిలీపై వెళ్లారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ నుండి బదిలీపై ముప్కాల్‌కు వచ్చిన రమేష్‌ను స్థానిక ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీవో గౌస్ మొహినొద్దీన్, ఎంపీవో శకుంతల, ముప్కాల్ పంచాయతీ సెక్రెటరీ మల్లేశ్ యాదవ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని గండిమాసానిపేట్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్త్యాల సుజాత ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజులు, పాఠశాల హెచ్ఎం రేణుక, ఉపాధ్యాయులు వెంకటయ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

అక్షరటుడే, ఇందూరు: విద్యారంగ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని తెలంగాణ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పంచరెడ్డి చరణ్ అన్నారు. జిల్లాకు వ్యవసాయ కళాశాలను మంజూరు చేయడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల మంజూరులో కీలక పాత్ర పోషించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డికి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు దత్తు, సతీష్, రమేష్, మీరన్, విశాల్, జగన్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

అక్షరటుడే, ఇందూరు: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ వైద్యులు అరవింద్ సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో శుక్రవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ.. అకస్మాత్తుగా ప్రమాదం సంభవించినప్పుడు అంబులెన్స్ వచ్చేవరకు నోటి ద్వారా శ్వాస అందించాలన్నారు. అలాగే సీపీఆర్ చేస్తూ ప్రథమ చికిత్స అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య, వాకర్ సభ్యులు పురుషోత్తం, విజయ్ కుమార్, శ్రీనివాస్, ఉమా ప్రసాద్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

కాలుజారి చెరువులో పడి వ్యక్తి మృతి

అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్ : ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కాస్లాబాద్‌లో చోటు చేసుకుంది. ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాస్లాబాద్‌కు చెందిన నడిపి సాయిలు (50) కూలి పనులు జీవనం సాగిస్తున్నాడు. అయితే మంగళవారం ఉదయం సీతాఫలాల కోసం వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి కోసం గాలించగా.. శుక్రవారం ఉదయం కింది చెరువులో సాయిలు మృతదేహాన్ని గుర్తించారు. కళ్లు సరిగ్గా కనిపించకపోవడంతో కాలుజారి చెరువులో పడి.. ఈత రానందున మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ముగ్గురు గడ్డిమందు తాగిన ఘటనలో మరొకరు మృతి

అక్షరటుడే, ఇందూరు: నగరంలోని శివాజీనగర్‌లో ముగ్గురు కుటుంబ సభ్యులు గడ్డిమందు తాగిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ముగ్గురు కుటుంబ సభ్యులను స్థానికులు వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇంటిపెద్ద దాసరి కిషన్ మృతి చెందిన విషయం విదితమే. కాగా.. మెరుగైన చికిత్స నిమిత్తం ఆయన భార్య నాగమణి, కొడుకు వంశీని హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అయితే కొడుకు వంశీ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. తల్లి సైతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోందని స్థానికులు పేర్కొన్నారు. ఇంట్లో గొడవల కారణంగా గడ్డి మందు తాగారని స్థానికులు వివరించారు.

యథేచ్ఛగా మొరం తవ్వకాలు

ఎడపల్లి మండలంలో మొరం దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. వ్యాపారులు యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఎడపల్లి మండలం జానకంపేట – మల్కాపూర్ గ్రామాల శివారులో కొందరు తవ్వకాలు చేపడుతున్నారు. అనుమతులు తీసుకున్న దాని కంటే అధికంగా తవ్వుతున్నారు. జేసీబీల సాయంతో తవ్వకాలు చేపట్టి నిత్యం వందల టిప్పర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఓవర్ లోడ్‌తో టిప్పర్లు వెళ్తుండడంతో రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- అక్షరటుడే, నిజామాబాద్

▸ నిత్యం వందల టిప్పర్లలో తరలింపు ▸ పట్టించుకోని అధికారులు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మొరం వ్యాపారులు గుట్టలను మాయం చేస్తున్నారు. అక్రమంగా తవ్వకాలు చేపట్టి టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జానకంపేట శివారులోని గుట్టలను మొరం వ్యాపారులు ఖతం చేస్తున్నారు. నిత్యం వందల టిప్పర్లలో మొరం తరలిస్తుండడంతో గుట్టలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. వ్యాపారులు అక్రమంగా తవ్వకాలు చేపడుతూ.. నిజామాబాద్ నగరంతో పాటు, బోధన్ తదితర ప్రాంతాలకు మొరం తరలిస్తున్నారు. ఇలా.. లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు.

స్పందించని అధికారులు

అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం చర్యలు చేపట్టడం లేదు. జానకంపేట శివారులో మొరం దందా రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో నడుస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు మామూళ్లు తీసుకొని అటువైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శులు వస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మొరం అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

అక్షరటుడే, ఆర్మూర్: నందిపేట్ మండలం ఖుదావందపూర్ గ్రామంలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. సొసైటీ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సొసైటీ చైర్మన్ వాకిడి కార్తీక్ రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ శుక్రవారం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం, మొక్కజొన్న విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో గంగాధర్, పీఏసీఎస్ డైరెక్టర్ తోట మహేష్, సీఈవో చిన్నయ్య, గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు భీమ మురళి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుక్కన్న, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పక్వాడాపై విద్యార్థుల ప్రతిజ్ఞ

అక్షరటుడే, బాల్కొండ: బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం 'స్వచ్ఛ భారత్' ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు తమ పరిసరాలు, కాలనీల్లో చెత్తలేకుండా, పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. 'స్వచ్ఛ భారత్' సాధనలో ముందుంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు.

బీసీ బంద్‌కు మద్దతు తెలుపుతున్న టీఎన్జీవో జిల్లా శాఖ

పాటిగల్లి వినాయక నగర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..

నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

బంద్‌కు సంపూర్ణ మద్దతు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో శనివారం తలపెట్టిన తెలంగాణ బీసీ బంద్‌కు అన్నివర్గాల ప్రజలు మద్దతు తెలిపారు. బీసీల హక్కులను అగ్రవర్ణాలు అడ్డుకోవడం సమంజసం కాదని బీసీ జేఏసీ పేర్కొంది. బంద్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలని జేఏసీ నాయకులు కోరారు. – అక్షరటుడే, నెట్‌వర్క్

కామారెడ్డి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో..

బాన్సువాడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో..

తెలంగాణ యూనివర్సిటీలో..

డ్రంకన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు

అక్షరటుడే, ఎల్లారెడ్డి: డ్రంకన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో తనిఖీలు చేస్తుండగా.. నలుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. వారిని ఎల్లారెడ్డి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుష్మ ఎదుట హాజరుపర్చారు. ఒక్కొక్కరికి ఒకరోజు జైలుశిక్ష, వేర్వేరుగా రూ.1,100 జరిమానా విధిస్తూ ఆమె తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముచ్కూర్ సొసైటీ మాజీ కార్యదర్శి మృతి

అక్షరటుడే, భీమ్‌గల్: ముచ్కూర్ గ్రామ రైతు సేవా సహకార పరపతి సంఘం మాజీ కార్యదర్శి కె.మురళి అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందాడు. కాగా అంతక్రియల నిమిత్తం సంఘం తరపున 20 వేల రూపాయలను బాధిత కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో సహకార పరపతి సంఘం అధ్యక్షుడు బంగ్లా దేవేందర్, వైస్ చైర్మన్ గంగారెడ్డి, డైరెక్టర్లు చిన్న రాజన్న, లక్ష్మీ దశాగౌడ్, లావణ్య అశోక్, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

తెయూలో సంబురాలు

అక్షరటుడే, డిచ్‌పల్లి: జిల్లాకు వ్యవసాయ కళాశాల ప్రభుత్వం మంజూరు చేయడాన్ని హర్షిస్తూ డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెయూ పరిశోధక విద్యార్థి సంఘం అధ్యక్షుడు పుప్పాల రవి ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పుప్పాల రవి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల నాయకుడు రాష్ట్ర కాంగ్రెస్ రథసారథి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ జిల్లాను ఎడ్యుకేషన్ హబ్ మారుస్తున్నారన్నారు. కళాశాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతి రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

అనుమతి లేకుండా పటాకుల అమ్మకాలు నిషేధం

అక్షరటుడే, ఇందల్వాయి: అనుమతులు లేకుండా పటాకుల దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఇందల్వాయి ఎస్సై సందీప్ హెచ్చరించారు. సీపీ ఆదేశాల మేరకు శుక్రవారం ఇందల్వాయి మండలంలో బాణాసంచా దుకాణం వ్యాపారులతో మాట్లాడారు. అధికారుల నుంచి అనుమతులు తీసుకుని మాత్రమే దుకాణాలు నడపాలని ఆదేశాలు జారీ చేశారు.

టాలెంట్ టెస్ట్‌కు జిల్లా విద్యార్థి

అక్షరటుడే, గాంధారి: పేట్ సంగెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని శరణ్య స్పేస్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిందని పాఠశాల హెచ్ఎం కుమారస్వామి తెలిపారు. శరణ్య ఇస్రో సందర్శనకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఛలో రాజ్‌భవన్‌కు వెళ్తున్న వారిని అరెస్ట్ చేయడం సరికాదు

అక్షరటుడే, ఇందూరు: బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఛలో రాజ్‌భవన్‌కు తరలివెళ్తున్న తమ నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పెద్ది వెంకట్రాములు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించినప్పటికీ గవర్నర్ ఆమోదం తెలుపకపోవడం విచారకరమన్నారు. అందుకే 18న బీసీ బంద్‌లో నిరసన తెలుపుతామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టి సాయిలు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు నర్సింలు, కార్మిక సంఘం ప్రతినిధి శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మను సన్మానించిన ఏఐసీసీ అబ్జర్వర్

అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్: పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న పెద్ద కొడప్‌గల్ మండల అధ్యక్షురాలు ఇందిరమ్మను ఏఐసీసీ అబ్జర్వర్ రాజాపాల్ కరోలా ఘనంగా సన్మానించారు. డీసీసీ అధ్యక్ష ఎంపికలో భాగంగా శుక్రవారం నిజాంసాగర్ మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మను శాలువాతో సత్కరించారు. పెద్ద కొడప్‌గల్ మండల కాంగ్రెస్ నాయకులు డీసీసీ అధ్యక్షుడిగా ఏలే మల్లికార్జున్‌ను నియమించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శి తీరుకు నిరసనగా ధర్నా

అక్షరటుడే, కోటగిరి: పంచాయతీ కార్యదర్శి తీరును నిరసిస్తూ పోతంగల్ మండల కేంద్రంలో గ్రామస్థులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను కార్యదర్శి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయంలో ఉన్న పాత ఇనుప వస్తువులను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, సమాచారం లేకుండా అమ్మేశారని మండిపడ్డారు. గ్రామ ప్రజలెవరైనా సమస్యలను విన్నవించేందుకు ఫోన్‌చేస్తే జవాబు ఇవ్వడం లేదని.. డబ్బులు తీసుకోనిదే ఏ పనీ జరగట్లేదని ఆరోపించారు. తాగునీటి సమస్య తలెత్తుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఆయనను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో చందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హన్మాండ్లు (బజరంగ్), పబ్బశేఖర్, సయ్యద్ హైమద్, నవీన్, వల్లెపు కురుమయ్య, చిన్న సాయిలు, కొట్టెల గంగారాం, కన్నం రాము, లక్ష్మణ్, ఒడ్డి నాగయ్య పాల్గొన్నారు.